క్లుప్తంగా

చురుగ్గా రోడ్డు పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గంలోని గద్దె వెంకట్రామయ్యనగర్‌లోని మెయిన్ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడ జేసీబీతో రోడ్డు సెక్షన్ చేస్తున్నారు. త్వరలోనే నాణ్యతాప్రమాణాలతో రోడ్డు పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు. అలాగే 30వ డివిజన్‌లోని యూజీడీ పంపింగ్ స్టేషన్, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ శనివారం ఆ పార్టీ నాయకులు 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి యరగొర్ల శ్రీరాములు, పార్టీ నాయకులు కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో డివిజన్‌లో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పలువురు డివిజన్ నాయకులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెళ్లి ఖర్చులకు ఆర్థిక సాయం అందజేత



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ముస్లిం యువతి వివాహానికి ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యులు రూ. 15 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. గొల్లపూడి ప్రాంతానికి చెందిన అన్వర్ కుమార్తెకు ఈ నెల 29న వివాహం జరగనుంది. నిరుపేద అయిన అన్వర్ కుమార్తె వివాహాన్ని జరిపేందుకు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా పెళ్లి ఖర్చులకు ఆర్థిక సాయం చేశారు. సింగ్‌నగర్‌లోని ఆ కమిటీ కార్యాలయంలో పెళ్లికుమార్తె సోదరుడు సద్దాంకు నగదును అందజేశారు. ఏఎంసీ నాయకులు షేక్ సమీనా ఫాతిమా, షేక్ సాజిద్ అలీ, కాలేషా, మౌలాలి, జరీనా పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణాజిల్లా కలిదిండి మండలానికి చెందిన ఊసల భోగేశ్వరరావు, నాగమణి దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. వారి 8 ఏళ్ల కుమారుడు ఊసల దీక్షిత్ మెదడులో ఇన్‌ఫెక్షన్ ఏర్పడి అది వెన్నుపూస వరకు చేరడంతో నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఎమర్జెన్సీ వార్డ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో బాలుడి తల్లిదండ్రులు దీవెన ఫౌండేషన్ సభ్యులను సహాయం కోసం ఆశ్రయించారు. దీంతో ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు పటమట కానిస్టేబుల్ రమణ, ట్రాఫిక్ కానిస్టేబుల్ నాగేంద్ర, కానిస్టేబుల్ బ్రహ్మం శనివారం హాస్పిటల్‌కు వెళ్లి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్న పేదవారికి సహాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులకు బాధితుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బ్యాంకు ఖాతా నుంచి నగదు డ్రా చేశారంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తన బ్యాంకు ఖాతా నుంచి యూపీఐ ద్వారా నగదు డ్రా చేశారంటూ శనివారం గుణదల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. గుణదల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదల కార్మెల్‌నగర్‌కు చెందిన వర్ధం నాగవెంకట నరసింహారావు భార్య పేరు మీద గుణదల యూనియన్ బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. ఈ నెల 19వ తేదీన బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ తీయించుకున్నారు. డిసెంబర్ ఒకటో తేదీన యూపీఐ ద్వారా రూ. 5వేలు డ్రా అయ్యినట్లు ఉంది. అలాగే గతంలో కూడా తమ ఖాతాలోంచి రూ.25వేలు కలిశెట్టి కృష్ణ అనే వ్యక్తి ఖాతాకు యూపీఐ ద్వారా డ్రా అయ్యినట్లు ఉంది. దీంతో తన భార్య ఖాతాలోంచి నగదు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ గుణదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల ఆర్థికవృద్ధికి సీఎం జగన్ కృషి

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు
- స్థానిక 57వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



33వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి



57వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పేద ప్రజల ఆర్థిక ఎదుగుదలకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నిరుపేద ప్రజల జీవితాలను మార్చిన జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటువేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ న్యూరాజరాజేశ్వరీపేట ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సీఎం జగనన్న పూర్తిచేశారని గుర్తు చేశారు. కేవలం ఓట్ల కోసం తప్ప 57వ డివిజన్ ప్రజల కష్టాలను గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇక్కడి ప్రజల బాధలను తెలుసుకొని ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడుగులు వేసిందన్నారు. రైల్వే స్థలంలో ఉన్న నివాసితుల కోసం రైల్వే అధికారులతో మాట్లాడి వారికి కూడా ప్రభుత్వం నుంచి ఇంటి పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

దేవాలయాల గురించి మాట్లాడే హక్కు టీడీపీకి లేదు..

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు న్యూఆర్ఆర్‌పేట ప్రాంత ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేయిస్తానని చెప్పి మోసం చేసిన బొండా ఉమాకు ఇక్కడి ప్రజలు మరోమారు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే వెలంపల్లి అన్నారు. 2014–19లో చంద్రబాబు, పవన్, బీజేపీ నాయకులే రాష్ట్రంలో దేవాలయాలను కూల్చిన దుర్మార్గులని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందరో దేవతామూర్తులను కూల్చేసి వాటిని వీఎంసీ శానిటరీ బండ్లలో తరలించి చెత్తలో పడేశారని గుర్తుచేశారు. దేవాలయాల గురించి మాట్లాడే హక్కు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులకు లేదన్నారు. 9 నెలల్లో రామతీర్థం దేవాలయాన్ని రాతి కట్టడాలతో సహా నిర్మించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు.

చంద్రబాబు కోసమే పవన్‌కళ్యాణ్ పార్టీ పెట్టాడు..

పవన్‌కళ్యాణ్ కేవలం చంద్రబాబు కోసమే పార్టీ పెట్టాడని, పార్టీ పెట్టి పదేళ్లు దాటినా కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేకపోయాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాపులను మోసం చేయడం, నమ్ముకున్న బీసీలకు అన్యాయం చేయడమే పవన్‌కు తెలుసని, పార్టీ కోసం కష్టపడిన పోతిన మహేష్‌కు సీటు ఎందుకు కేటాయించలేదని నిలదీశారు. రాష్ట్ర ప్రజలంతా జగనన్నను తిరిగి సీఎంగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట శ్రీనివాస్, మల్లెల చెన్నకేశవరెడ్డి, ఇసరపు రాజు, ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, బాల తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గంలో మరోమారు వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలు ఆడనుందని ఆ పార్టీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం 33వ డివిజన్ సత్యనారాయణపురంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి వారు పర్యటించారు. గడప గడపకు వెళ్లి స్థానికులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ జూదరులు, జలసాపరులు, ప్రజలను పట్టించుకోకుండా తిరిగే నాయకుడు కావాలో.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే వెలంపల్లి శ్రీనివాసరావు కావాలో నిర్ణయించుకోవాలన్నారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ విజయానికి బాటలు వేస్తాయన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు మే 13న జరగనున్న ఎన్నికల్లో తమ ఓటుతో అవినీతిపరుడైన బొండా ఉమాకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం, సింగ్‌నగర్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించండి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల అవసరాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎంపీ కేశినేని నాని సతీమణి కేశినేని పావని, వెలంపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యురాలు వెలంపల్లి శ్రీలక్ష్మి కోరారు. స్థానిక 26వ డివిజన్ మాచవరంలో శనివారం వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి అంగిరేకుల గొల్లభామతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు పేరం త్రివేణిరెడ్డి,పిల్లుట్ల వంశీ,పారా ప్రసాద్ పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులకు మద్దతుగా వారి కుటుంబ సభ్యులు సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో పర్యటించారు. కేశినేని నాని సతీమణి కేశినేని పావని, వెలంపల్లి సోదరుడు రామకృష్ణ, అతని సతీమణి శ్రీలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినాసుల్తానాలు సింగ్‌నగర్ దాబాకొట్లు సెంటర్‌లోని పలు వీధుల్లో ఎన్నికల ప్రచారం చేసి ఓట్లను అభ్యర్థించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు ఎండీ హాఫీజుల్లా, జమీర్, అమిత్, చింతా శ్రీను పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్‌పై మోదీతో స్పష్టత ఇప్పించగలరా?

- రీకాల్ విధానంలో మొదటి వేటు సుజనాపైనే
- ఎంపీ కేశినేని నాని కుమార్తె శ్వేత



ప్రచారంలో భాగంగా ప్రజలతో కేశినేని శ్వేత, రెహమతున్నీసా, నీలోఫర్, హయాత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ముస్లిం మైనార్టీ రిజర్వేషన్ రద్దు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర బీజేపీ నాయకులు బాహాటంగానే ప్రకటించడంపై ముస్లిం సామాజికవర్గం మొత్తం నివ్వెరపోతోందని విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. వచ్చే నెల 3న ప్రధాని మోదీ విజయవాడకు రానున్నారని ప్రచారం చేసుకుంటున్న కూటమి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి ముస్లిం మైనార్టీ రిజర్వేషన్‌పై మోదీతో స్పష్టత ఇప్పించగలరా అని సవాల్ విసిరారు. విద్యాధరపురంలో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, ఆమె తనయుడు, వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్–నీలోఫర్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కేశినేని శ్వేత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ గెలుపును కాంక్షిస్తూ వారు గడప గడపకు వెళ్లి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఇక అభివృద్ధి విషయానికి వస్తే సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే విజయవాడ నగరం, ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని తెలిపారు.

రీకాల్ విధానం వస్తే మొదట సుజనా చౌదరినే పిలవాలి..

పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి కోరుకుంటున్నట్లుగా ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రజాప్రతినిధులను రీకాల్ చేసే విధానం వస్తే ముందుగా అతన్నే వెనక్కి పిలవాలని కేశినేని శ్వేత అన్నారు. ఎందుకంటే 12 ఏళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ఉన్న సుజనా చౌదరి విజయవాడ నగరానికి ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యులకు కేంద్రం ప్రతి ఏటా కేటాయించే రూ. 60 కోట్లలో విజయవాడకు ఎంత ఖర్చు చేశారని ప్రశ్నించారు. సుజనా చౌదరి వంటి పొలిటికల్ టూరిస్ట్ వలన నియోజకవర్గానికి ఒనగూరేదేమీ లేదని చెప్పారు. సీటు కోసం వందల కోట్లు ఖర్చు చేసే సుజనా వంటి పెత్తందార్లు రేపు పొరపాటున గెలిస్తే అంతకు మించి దోచుకునేందుకే తప్ప ప్రజాసేవకు కాదని అన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో సమస్య వస్తే ముందుగా తలుపు తట్టేది కేశినేని భవన్‌దని, నగరంలో రెండు ఫ్లై ఓవర్‌లను సాధించిన ఘనత కేశినేని నానీదేనని అన్నారు. అభివృద్ధిని కాంక్షించేవారు రానున్న ఎన్నికల్లో కేశినేని నానీతో పాటు నిరంతరం ప్రజల మధ్య ఉండే పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ అనీస్, ఎస్‌కే నజీర్, బి.శాంతి, ఈశ్వర్(ఈసు), అబ్దుల్ రవూఫ్, దాదా, నేలంగి నరసింహారావు, విజయ్, మంటి రాము, పితాని వెంకటరావు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

300 మందికి ఉచిత వైద్య పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): సీతారామపురంలోని దీపక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిమ్మతోట సెంటర్‌లోని రిలయన్స్ సూపర్‌మార్కెట్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆ షోరూమ్‌లో పనిచేసే సిబ్బందితో పాటు, కొనుగోలు చేసేందుకు వచ్చిన కస్టమర్స్‌కి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, బీఎంఐ పరీక్షలతోపాటు, అవసరమైన వారికి ఉచితంగా ఈసీజీ చేశారు. శిబిరంలో పాల్గొన్న వారికి డాక్టర్ జయకిషోర్ వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ పదముత్తం సురేష్‌కుమార్ మాట్లాడుతూ శిబిరంలో నిర్వహించిన పరీక్షల్లో ఆస్పత్రిలో చికిత్సలు అవసరమైన వారికి 50 శాతం రాయితీతో అందించనున్నట్లు తెలిపారు. అన్ని రకాల రక్తపరీక్షలపై 50 శాతం రాయితీ ఇస్తున్నామని, ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మా గాంధీరోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో మహిళలను ఆకట్టుకుంటోంది. మే 1 వరకూ నిర్వహించే ఈ ఎక్స్‌పోలో విస్తృత శ్రేణి వస్త్రాలు, వివాహాలు, వేసవికి కావాల్సిన అద్భుతమైన పట్టు, కాటన్ చీరలు, అందుబాటులో ఉంచారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వంద మందికి పైగా పేరొందిన డిజైనర్లు, చేనేత పనివారు స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు మేనేజర్ రాజు తెలిపారు. పట్టు, కాటన్ చీరలు, సూట్లు, డ్రెస్ మెటీరియల్స్‌తో పాటు, ఆకర్షణీయమైన ఫ్యాషన్ జ్యూయలరీ, ఎన్నో రకాల ఉత్పత్తులను ఈ ఎక్స్‌పోలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటల వరకూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సమగ్ర అభివృద్ధి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



31వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ శిరీష తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అభివృద్ధి, సంక్షేమానికి చోటు కల్పించాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 31వ డివిజన్ పసుపుతోటలో శనివారం స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, వెలంపల్లి శ్రీనివాసరావు సోదరుడు వెలంపల్లి రాఘవ నరసింహారావు, కేశినేని నాని అల్లుడు కాజా రఘునాథంతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో అందినకాడికి దండుకున్నారని తాము శ్యాచురేషన్ పద్ధతితో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేశామని గుర్తుచేశారు. పేదల జీవితాలు బాగుపడాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని అన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావులను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. దారి పొడవునా మహిళలు, పలు పథకాల లబ్ధిదారులు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలి

– వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గానరేష్



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గానరేష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని బీసీలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోను దుర్గానరేష్ పిలుపునిచ్చారు. శనివారం విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి వారి అభివృద్ధికి సీఎం జగన్ ఎనలేని కృషి చేశారన్నారు. బీసీలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. అధికారంలో ఉండగా బీసీలను అడుగడుగునా మోసం చేసి, అవమాన పరచిన బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఈ ఎన్నికల్లో విజయవాడలోని మూడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. తనను వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించడం సంతోషంగా ఉందని అన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైఎస్సార్ సీపీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులపైన బోను దుర్గానరేష్‌ను బీసీ సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం అధికార ప్రతినిధి కిరణ్, ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు రంగు విక్రమ్, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు రంగు జ్యోతి, రామ్మోహన్‌రావు, బీసీ సంక్షేమ సంఘం నగర అధికార ప్రతినిధి చింత శ్రీను, రామకృష్ణ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ శనివారం ప్రకటించిన ఆచరణాత్మక మేనిఫెస్టో పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయడంతోపాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన మేనిఫెస్టో అన్నివర్గాల్లో వెలుగులు నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురాబోతుంది. పేదలకు ఇప్పటికే కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. ఇప్పుడు కార్డియాలజీ ఆసుపత్రులు, క్యాన్సర్ సెంటర్‌లు ఏర్పాటు చేయడం ద్వారా మరింత మెరుగైన వైద్యసేవలు అందించే అవకాశం ఏర్పడుతుంది. టీడీపీ పాలనలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన ఆరోగ్య రంగం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అంతర్జాతీయ స్థాయిలో సేవలు అందించే దిశగా అడుగులు వేస్తుంది.

–డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్
వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మేనిఫెస్టో



ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో ప్రకటించింది. ఇప్పటికే పేదల జీవితాల్లో నూతన వెలుగులు నింపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాబోయే రోజుల్లో మరింత మెరుగైన సేవలు అందిస్తారని విశ్వసిస్తున్నాను. చేయని పనులను, హామీలను ఇవ్వని ఏకైక వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి.

–కడవకొల్లు వెంకటేశ్వరరావు,
టీచర్స్‌కాలనీ

మధురంగా సాగిన ఐశ్వర్య గాత్ర కచేరి



గానం చేస్తున్న ఐశ్వర్య, వాద్య సహకారం అందిస్తున్న శ్రీనివాసమూర్తి, సీహెచ్ సూర్య

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో లబ్బీపేట పైడయ్యవీధిలోని మహతి మినీ ఆడిటోరియంలో శనివారం యువ సంగీత విద్వాంసురాలు ఎ.ఐశ్వర్య నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. నారాయణ తీర్థుల తరంగం జయ జానకీ కాంత, అన్నమాచార్య సంకీర్తన భావయామి, త్యాగరాజ స్వామి కీర్తన వాసుదేవయని, భద్రశైల రాజమందిర తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై గండూరి శ్రీనివాసమూర్తి, మృదంగంపై సీహెచ్ సూర్య సహకరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మే 13 వ తేదీ నుంచి వారం రోజులపాటు శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో సద్గురు త్యాగరాజ స్వామి 257వ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి సంగీత విద్వాంసులతో పాటు యువ సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామికి కృతుల సమర్పణ చేస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు టీవీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.

యాగశాలలో గణపతికి అభిషేకాలు, హోమం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై నూతన యాగశాలలో శనివారం గణపతికి విశేష అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. శనివారం ఉదయం యాగశాలలో గణపతి ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ, అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్చారణ, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి అర్చన నిర్వహించగా, ఆలయ ఈఓ కేఎస్ రామరావు దంపతులు పాల్గొన్నారు. ఆలయ వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణమూర్తి, కోట ప్రసాద్, మురళీధర్ శాస్త్రి, రఘునాథశర్మ(పండు) అభిషేకాలు, పూజ, గణపతి మంత్ర హోమాలను జరిపించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం, వేద ఆశీర్వచనం, ప్రసాద వితరణ జరిగాయి. పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు.

అలరించిన భరత నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై చెన్నైకి చెందిన మైత్రి సెంటర్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన నృత్యకారులు ప్రదర్శించిన భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శనివారం సాయంత్రం మైత్రి సెంటర్‌కు చెందిన అధితి అరుణ్, దీక్షిక అరుణ్, ఆర్.స్వాతి, ఆర్.శ్వేత, బి.నివాసిని, ఆర్.శ్రీజ, గాయత్రి ఆనంద్, సాయిశ్రేయ, అభినయ, దీపిక పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం వారికి అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.